

# బిజెపి తీర్థం పుచ్చుకున్న కుమార్

## బిజెపితోనే దేశ అభివృద్ధి సాధ్యం : ఈటెల


**కీసర, నవంబర్ 10 (నేటి ప్రస్థానం) :** భారతీయ జనతా పార్టీతోనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని నేతాజీ నగర్ కాలనీకి చెందిన కుమార్ ఆధ్వర్యంలో 25 మంది వివిధ పార్టీల నుండి ఆదివారం బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ వారిని కండువా కప్పి పార్టీలోనికి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పదవుల కోసం కాదు పోటీపడేది పార్టీ బలోపేతానికి, క్రమశిక్షణతో సైనికుల పనిచేయాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలోజిల్లా అధ్యక్షులు విక్రం రెడ్డి, నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమలరెడ్డి, బిజ్జ శ్రీనివాస్ గౌడ్, మామిడి జంగారెడ్డి, రామక్కపేట రవీందర్ రెడ్డి, జూపల్లి నరేష్, పొతంశెట్టి వెంకటేశ్వర రావు, సూర్య శేఖర్ రెడ్డి, కర్ర వెంకటేశ్వరరావు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



# కొత్తకోటకు చేరుకున్న పాదయాత్ర

- పాదయాత్ర కఠినమైన సరే అయ్యప్పను దర్శించుకుంటాము
- గురుస్వామి కౌకుట్ల ప్రభాకర్ రెడ్డి

**కీసర, నవంబర్ 10 (నేటి ప్రస్థానం) :** శబరిమలకు వెళ్లడానికి ఎంత కఠినమైన సరే మణికంఠ స్వామిని దర్శించుకుం టామని గురుస్వామి కౌకుట్ల ప్రభాకర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అయ్యప్ప స్వాముల మహా పాదయాత్రలో భాగంగా నాగారం మున్సిపాలిటీ నుండి అయ్యప్ప స్వామి భక్త బృందం కొత్తకోటకు కొనసాగింది. ఆదివారం కొమ్మిరెడ్డిపల్లి ప్రాంతం నుండి కొత్తకోటకు ఈ మహా పాదయాత్ర చేరుకుందని గురుస్వామి కౌకుట్ల ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయ్యప్ప స్వామి నామస్మరణం భక్తితో స్మరించుకుంటే పాదయాత్ర అవలీల గా ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ పాదయాత్రలో గురుస్వామి వంగేటి నరసింహారెడ్డి,దాసరి వెంకట్ రెడ్డి, గొప్ప సంతోష్ రెడ్డి, శివ కుమార్ యాదవ్, సునీల్, ప్రవీణ్, ర్యాల బాలు యాదవ్, వంశీ స్వాములు ఉన్నారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఈటెల

**కీసర,నవంబర్10 (నేటి ప్రస్థానం) :** పెళ్లిళ్లు స్వర్గంలో ముక్కోటి దేవతలు నిర్ణయిస్తారని మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు.నాగారం మున్సిపాలిటీ 20వ వార్డు కౌన్సిలర్ అన్నంరాజు సుమిత్ర సురేష్ కుమార్తె వివాహం ఆదివారం ఘనంగా జరిగింది.ఈ వివాహ శుభకార్యానికి మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి తో కలిసి నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో ఏనుగు సుదర్శన్ రెడ్డి,వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్,కౌన్సిలర్లు,కో-ఆప్షన్ సభ్యులు, శిలాసాగరం నాగేందర్, వివిధ పార్టీ నాయకులు, రక్తసంబందులు తదితరులు పాల్గొన్నారు.



# అమరావతి అభివృద్ధికి ముందడుగు

- రాజధాని రూ.15 వేల కోట్ల రుణంపై నేడు సంతకాలు
- ఏడీబీ, ప్రపంచ బ్యాంకులతో ఒప్పందం కుదుర్చుకోనున్న సీఆర్డీఏ కమిషనర్
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

**అమరావతి:** రాజధాని అమరావతికి ప్రపంచబ్యాంకు, ఏడీబీ ఇస్తున్న రుణం వినియోగంపై రాష్ట్రప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. 'రాజధాని అమరావతి సమగ్ర, సుస్థిర నగర అభివృద్ధి ప్రాజెక్టు'లో భాగంగా తొలిదశలో రూ.15వేల కోట్లతో చేపడుతున్న పనులకు ప్రపంచబ్యాంకు, ఏడీబీ కలిసి సుమారు రూ.13,500 కోట్లు రుణంగా ఇస్తున్నాయి. మిగతా రూ.1,500 కోట్లను కేంద్రప్రభుత్వ సహకారంతో రాష్ట్రప్రభుత్వం సమకూర్చుకో నుంది. ప్రపంచబ్యాంకు, ఏడీబీ రుణం మంజూరు ప్రక్రియ చివరి దశకు చేరడంతో సీఆర్డీఏను ప్రాజెక్టు అమలు సంస్థగా నియమిస్తూ, రాష్ట్రప్రభుత్వం తరఫున ఆ సంస్థలతో ఒప్పందం చేసుకునేందుకు సీఆర్డీఏ కమిషన ర్కు అధికారాలిస్తూ జీఓ ఇచ్చింది. ఈ మేరకు దిల్లీలో సోమ, మంగళవారాల్లో రుణ ఒప్పందంపై కమిషనర్ సంతకాలు చేయనున్నారు. నిధుల వినియోగానికి బడ్జెట్ లో ప్రత్యేక హెడ్ ఆఫ్ ఎకౌంట్ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. రాజధానిలో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లుల్ని సీఆర్డీఏకి ప్రత్యేక ఖాతాలో జమచేస్తారు. అమరావతికి ప్రపంచబ్యాంకు, ఏడీబీల నుంచి అత్యంత వేగంగా రుణం మంజూరైంది. రాజధానికి రూ.15,000 కోట్ల ఆర్థికసాయం కావాలని సీఆర్డీఏ ఈ ఏడాది ఆగస్టు 22న కేంద్ర ఆర్థికశాఖకు ప్రతిపాదన పంపింది. అమరావతికి చెరో రూ.6,750 కోట్ల రుణం ఇచ్చేందుకు ఆ రెండు సంస్థలూ అంగీకారం తెలిపాయని సెప్టెంబరు 11న ప్రభుత్వానికి కేంద్ర ఆర్థికశాఖ నుంచి వర్తమానం అందింది. అక్కడి నుంచి ప్రపంచబ్యాంకు, ఏడీబీ ప్రతినిధులతో కేంద్ర ఆర్థికశాఖ, రాష్ట్ర ప్రభుత్వం, సీఆర్డీఏ అధికారుల చర్చలు, సంప్రదింపులు శరవేగంగా జరిగాయి. ప్రోగ్రామ్ ఫర్ రిజల్ట్స్, రిజల్ట్ బేస్డ్ లెండింగ్ విధానాల కింద ఆ రెండు బ్యాంకులూ రుణం ఇస్తున్నాయి. రాజధాని అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా... ప్రధాన రహ దారులు, యుటిలిటీ డక్ట్ల నిర్మాణం, స్టార్మ్వాటర్ డ్రెయి న్లు, వరద నివారణకు రిజర్వాయర్లు, కాలువలు, లిఫ్ట్ స్కీమ్లు, రైతులకు స్థలాలు కేటాయించిన ఎల్పీఎస్ లేఅవుట్ల అభివృద్ధి, తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల, శుద్ధి వ్యవస్థల నిర్మాణం, శాసనసభ, హైకోర్టు, సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయ భవనాలు, నివాస గృహాల నిర్మాణం చేపడతారు. ప్రపంచబ్యాంకు, ఏడీబీల నంచి వచ్చే నిధుల్ని వీటికి వినియోగిస్తారు.

# విశాఖ స్టీల్ప్లాంట్ను ప్రైవేటీకరణ చేయాలన్న ఆలోచన కేంద్రానికి లేదు

## కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ



**జంగారెడ్డిగూడెం:** విశాఖ స్టీల్ ప్లాంట్ను ప్రైవేటీకరణ చేయాలన్న ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి లేదని కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ తెలిపారు. ఆదివారం ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం పట్టణంలో పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖ స్టీల్ప్లాంట్కు భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు రాకుండా కేంద్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం దిశగా ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. నష్టాల్లో ఉన్న స్టీల్ప్లాంట్ను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని గుర్తు చేశారు. భద్రాచలం-కొవ్వూరు రైల్వే లైన్ నిర్మాణం సత్తుపల్లి వరకు పూర్తయిందని, మిగతాది త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. రెండు నెలలుగా పోలవరం ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.15వేల కోట్లు విడుదల చేసిందని, అవసరమైన నిధులు విడుదల చేసేందుకు కేంద్రం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. సాధ్యమైనంత తొందరగా పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయని శ్రీనివాస్వర్మ తెలిపారు.

# ఏపీలో పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీలు

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్లో పలువురు ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్థికశాఖ కార్యదర్శిగా రొనాల్డ్ రాస్, మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా కె.కన్నబాబుకు పూర్తి అదనపు బాధ్యతలు, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీగా బి.అనిల్ కుమార్రెడ్డి, కార్మిక, ఫ్యాక్టరీలు, బాయిలర్లు, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ అదనపు కార్యదర్శిగా గంధం చంద్రుడు, వ్యవసాయ, సహకారశాఖ డిప్యూటీ సెక్రటరీగా డి.హరిత.

